సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



దళిత రైతులకు అండగా..

ప్రకృతి వ్యవసాయంలో రాణించేలా ఎస్సీ రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. విత్తన కిట్లు ఉచితంగా అందించడంతో పాటు అవసరమైన సాయం చేస్తోంది.

8లో



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3, సరాసరిన రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం

36.1°/22.3°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. కాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

ఉద్యాన పంటలకూ 'ఈ క్రాప్' తప్పనిసరి



తాడిమర్రిలో చీనీ తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్

పుట్టపర్తి అర్బన్: ఉద్యాన పంటల సాగు రైతులు కూడా 'ఈ క్రాప్' నమోదు తప్పనిసరిగా చేయించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో పండ్లు, పూలు, కూరగాయలు తదితర పంటలు సుమారు 1.23 లక్షల ఎకరాల్లో సాగులో ఉండగా, ఇప్పటి వరకూ 1.06 వేల ఎకరాల పంటలను మాత్రమే నమోదు చేశారన్నారు. ఈ క్రాప్ విషయంలో రైతులు కూడా సహకరించాలని కోరారు. పంటలకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఏటా ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. ఈ క్రాప్ బుకింగ్ గణాంకాల ప్రకారమే చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఆర్‌బీకే సిబ్బంది, ఉద్యానశాఖ సిబ్బందితో ఈ క్రాప్ నమోదు చేయించాలని సూచించారు. ప్రక్రియ వారంలో పూర్తైతే అక్టోబర్‌లో సచివాలయాలు, ఆర్‌బీకేల్లో రైతుల వివరాలను ప్రదర్శనకు ఉంచుతామని వివరించారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం, ధర్మవరం, కదిరి ఆర్డీఓ కార్యాలయాలు, మండల స్థాయిలోనూ ఉదయం 10 గంటలకు 'స్పందన' ప్రారంభమవుతుందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. వినతి పత్రాలపై ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం 'స్పందన' నిర్వహిస్తారు. ప్రజలు వివిధ సమస్యలపై ఎస్పీకి నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

యోగా నిత్యజీవితంలో భాగం కావాలి

అనంతపురం కల్చరల్: మనిషిని సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తీర్చిదిద్దగలిగిన యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని షిరిడీనగర్‌లో ఉన్న వివేకానంద యోగా భవన్‌లో ఆదివారం వివేకానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన చిన్నారులకు యోగాసన పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ముఖ్య అతిథి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు యోగా పట్ల శ్రద్ధ కల్గించాలని సూచించారు. బీఎస్ఎన్ఎల్ రాజశేఖరరెడ్డి, యోగా గురువులు కృష్ణవేణి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



కోలాహలం నడుమ సాగుతున్న వినాయక విగ్రహాల శోభాయాత్ర

వెళ్లిరావయ్యా.. బొజ్జ గణపయ్యా

- 'పురం'లో వైభవంగా వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం
- మార్మోగిన లంబోదరుడి నామస్మరణ
- భక్తపారవశ్యంలో మునిగిన జనం

హిందూపురం సాక్షి బృందం: బొజ్జగణపయ్య నిమజ్జనోత్సవం ఆదివారం హిందూపురంలో అంగరంగ వైభవంగా జరిగింది. యువతలో ఉత్సాహం ఉరకలేసింది. విఘ్నవినాయకుడి నామస్మరణ మార్మోగింది. మత సామరస్యం వెల్లివిరిసింది. పట్టణం రంగులమయమైంది. కొలువుదీరినప్పటి నుంచి విశేష పూజలందుకున్న లంబోదరుడు ప్రశాంత వాతావరణంలో గంగమ్మ ఒడికి చేరాడు. వాడవాడలా కొలువుదీరిన గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ట్రాక్టర్లు, ప్రత్యేక వాహనాల్లో నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా జనం ఆధ్యాత్మిక సాగరంలో మునిగిపోయారు.డీజే పాటలకు ఉల్లాసంగా డ్యాన్సులు చేస్తూ ముందుకు కదిలారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ రంగులు చల్లుకుని సందడి చేశారు.

వర్షంలోనూ జోరు..

హిందూపురంలో ఆదివారం సాయంత్రం జోరు వాన కురిసింది. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే కొంత సేపు ఆపివేశారు. అయితే, వర్షంలోనూ చాలా మంది డ్యాన్సులు చేస్తూ కేరింతలు కొట్టారు. నిమజనోత్సవాన్ని పురస్కరించుకుని గురునాథ్ సర్కిల్, గాంధీ బజార్, చిన్నమార్కెట్, దండు రోడ్డు, రైల్వే రోడ్లలో పలువురు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఉత్సవంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎస్పీ మాధవరెడ్డి పర్యవేక్షణలో ఐదుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 60 మంది ఎస్‌ఐలు, 500 మంది పోలీసులు, 100 మంది స్పెషల్ పార్టీ సిబ్బంది, రెండు వజ్ర వాహనాలతో పహారా కాశారు.

భారీ క్రేన్‌లతో నిమజ్జనం

పట్టణంలో ఈ సారి 20 అడుగులకు పైగా ఉన్న విగ్రహాలు 30 వరకూ ఏర్పాటు చేశారు. దీంతో గుడ్డం కోనేరు వద్ద క్రేన్‌లు ఏర్పాటు చేశారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో విగ్రహాలను ప్రశాంత వాతావరణంలో గంగమ్మ ఒడికి చేర్చారు.



గుడ్డం కోనేరులో విగ్రహాల నిమజ్జనం



నిమజ్జనోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



విగ్రహాలు తరలిస్తున్న వాహనాల ముందు డ్యాన్సు చేస్తున్న యువత



గంగమ్మ ఒడికి చేరుకున్న గణనాథుడు

బాబు స్కిల్.. సైకిల్!

'భవిష్యత్తుకు గ్యారంటీ' కనిపించడం లేదు. 'స్కిల్' అక్రమాల కేసులో అధినేత అరెస్టై టీడీపీని పూర్తిగా ముంచేశారు. కేడర్‌ను కాపాడాల్సిన చినబాబు హస్తిన చేరారు. అరెస్టు భయం వెంటాడుతుండటంతో బడా నాయకులు ఎవరూ ముందుకు రావడం లేదు. ఫలితంగా జిల్లాలో టీడీపీ క్రమంగా జీరో అవుతోంది. ముందుండి నడిపించే నాయకుడు లేక తమ్ముళ్లలో నైరాశ్యం నెలకొంది.

- టీడీపీ ఉనికికే ముప్పు తెచ్చిన 'స్కిల్' కుంభకోణం
- చంద్రబాబు అరెస్టుతో ఆ పార్టీ ముఖ్య నేతల డీలా
- జనసేనతో పొత్తుపై తీవ్ర వ్యతిరేకత
- వైఎస్సార్‌సీపీలోకి పెరిగిన చేరికలు
- ఈసారి ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేస్తామని అధికార పార్టీ ధీమా



సాక్షి, పుట్టపర్తి: టీడీపీ వెంట నడిస్తే రాజకీయ భవిష్యత్తు ఉండదని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీర్మానించుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే చాలా చోట్ల ఇతర పార్టీల్లో చేరారు. మరికొందరు చేరేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల అమలు చేసి అన్ని వర్గాల వారికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేరువయ్యారు. ఈ క్రమంలో ఆ పార్టీ ఈ పార్టీ ఎందుకని వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకునేందుకు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు రెడీ అవుతున్నారు. ఇటీవల జిల్లావ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు పెరిగాయి. 2019 ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 12 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలు కైవసం చేసుకున్న వైఎస్సార్‌సీపీ.. ఈసారి అంతకు మించి స్థానాలు సాధించే దిశగా బలపడినట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

మేం నమ్మం బాబూ..

చంద్రబాబు అరెస్టుతో జిల్లాలో టీడీపీ నేతలకు వణుకు పట్టుకుంది. 'అక్రమ అరెస్టు..'అని అధిష్టానం అంటున్నా.. 'తమ్ముళ్లే' నమ్మడం లేదు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఎంత బతిమలాడినా వెంట నడిచేందుకు కార్యకర్తలు సుముఖత చూపడం లేదు. దీంతో ఇన్‌చార్జ్‌లు కూడా చేసేది లేక ఒకట్రెండు రోజులు హంగామా చేసి తర్వాత ఇంటికే పరిమితమయ్యారు. మరికొందరు నియోజకవర్గ కేంద్రం వదిలి బంధువుల ఊళ్లు, స్వగ్రామాలు, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లినట్లు తెలిసింది. బాబు జైలులో.. చినబాబు ఢిల్లీలో ఉండటంతో డైరెక్షన్ చేసే దిక్కు లేక.. తలోదారి చూసుకుంటున్నట్లు సమాచారం.

బీజేపీ ప్రయత్నాలు ఫ్లాప్!

టీడీపీకి మద్దతు ఇస్తామని.. కలిసి పోటీ చేస్తామని పవన్ కల్యాణ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఆ మేరకు క్షేత్రస్థాయిలో సయోధ్య కుదరడం లేదు. ఈ క్రమంలో రెండు పార్టీల నేతల మధ్య చీలికలు వచ్చి కేడర్‌లో స్థైర్యం మరింత దెబ్బతిన్నట్లు సమాచారం. ఇదే అదనుగా టీడీపీ - జనసేన నేతలను ఆహ్వానించి బలపడాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నా.. రాష్ట్రంలో బలంగా లేని ఆ పార్టీలో చేరడం కంటే అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీవైపే ఆయా పార్టీల నాయకులు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.



ఇటీవల ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు (ఫైల్)

ఈ సారి క్లీన్‌స్వీపే..



ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని బలోపేతం చేస్తున్నాం. ఈసారి ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. టీడీపీకి దిక్కు లేకుండా పోయింది. ఓట్లు అడిగే అర్హత కూడా కోల్పోయింది. అందరి సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేసిన వైఎస్సార్‌సీపీకి మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– మాలగుండ్ల శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

జయహో 'వందేభారత్'

- ప్రజల నుంచి రైలుకు ఘన స్వాగతం



ధర్మవరం రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న ప్రజలు, విద్యార్థులు

ధర్మవరం/హిందూపురం: 'జయహో వందే భారత్' నినాదాలతో ధర్మవరం, హిందూపురం రైల్వేస్టేషన్లు ఆదివారం హోరెత్తాయి. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కాచిగూడ నుంచి బయలుదేరి అనంతపురం మీదుగా ఆయా రైల్వేస్టేషన్లకు చేరుకుంది. స్థానికులు, విద్యార్థులతో కలిసి హిందూపురంలో ఎంపీ గోరంట్ల మాధవ్ రైలుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మీదుగా వందేభారత్ రైలు పరుగులు పెట్టడం సంతోషదాయకమన్నారు. హిందూపురంలో ఆగేలా చూడాలని రైల్వే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయంపై వైఎస్సార్ సీపీ హిందూపురం సమన్వయకర్త దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి స్థానిక అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

సందడే.. సందడి

ధర్మవరంలో సందర్శకుల వీక్షణ కోసం వందే భారత్ రైలు అరగంట ఆపడంతో సందడి నెలకొంది. కోచ్‌లను చూసేందుకు జనం ఆసక్తి చూపారు. కాచిగూడ నుంచి ధర్మవరం మీదుగా బెంగళూరుకు వారంలో 6 రోజులు 'వందేభారత్' రాకపోకలు ఉంటాయని, పట్టు చీరల వ్యాపార కేంద్రమైన ధర్మవరం ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని రైల్వే ఉన్నతాధికారులు పేర్కొన్నారు. 530 మంది దాకా ప్రయాణికులు కూర్చోవచ్చన్నారు. ఒక ఎగ్జిక్యూటివ్ క్లాస్, ఏడు చైర్ కార్ కోచ్‌లు ఉంటాయని పేర్కొన్నారు. వందేభారత్ రాక సందర్భంగా రైల్వేస్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ మేనేజర్ నరసింహనాయుడు, జీఆర్‌పీ సీఐ బోయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వే అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్, సమన్వయకర్త దీపిక



పెదపల్లి వద్ద మరువ పారుతున్న ఆర్డీటీ చెక్ డ్యాం



పుట్టపర్తి పట్టణ సమీపంలో జలకళ సంతరించుకున్న చెక్‌డ్యాం



పెదపల్లి వద్ద పచ్చదనం సంతరించుకున్న జొన్న పంట

వాన జోరు.. నీటి హోరు

పుట్టపర్తి అర్బన్/టౌన్: జిల్లాపై వరుణుడి కరుణ కొనసాగుతోంది. వరుసగా రెండో రోజు ఆదివారం కూడా వాన ముంచెత్తింది. ఇటీవల వర్షాభావ పరిస్థితులతో చాలా గ్రామాల్లో బోరుబావుల్లో నీళ్ల తగ్గాయి. ఈ క్రమంలోనే కురిసిన భారీ వర్షాలతో ఊరట దక్కడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పంటల నుంచి మంచి దిగుబడి వస్తుందని తెలిపారు.

ఎన్‌పీ కుంటలో అత్యధికం..

జిల్లాలో 32 మండలాలు ఉండగా 27 మండలాల్లో వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా సగటు వర్షపాతం 29.1 మిల్లీ మీటర్లు నమోదైందని పేర్కొన్నారు. ఇందులో అత్యధికంగా ఎన్‌పీ కుంట మండలంలో 76.2, తలుపుల- 72.4, పుట్టపర్తి-69.6, కదిరి- 68, నల్లమాడ- 67.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే, బుక్కపట్నంలో 56.4 మి.మీ, నల్లచెరువు- 50.6, గాండ్లపెంట-48.2, పెనుకొండ- 45.4, కొత్తచెరువు- 44.2, ముదిగుబ్బ- 40.2, పరిగి-38.6, లేపాక్షి-38.2,అమడగూరు- 37.4, తనకల్లు-36.4, హిందూపురం-28.6, సోమందేపల్లి-24.6, గోరంట్ల-22.4, చిలమత్తూరు- 21.4, ఓడీ చెరువు-17.2, మడకశిర -11, గుడిబండ-6.6, తాడిమర్రి-6.2, బత్తలపల్లి, రొద్దం-2.2, రొళ్ల, అగళి 2 మి.మీ మేర వర్షపాతం నమోదైంది.

ఒళ్లంత.. తుళ్లింత..



రెండురోజులుగా కురిసిన వర్షాలకు తలుపుల మండలంలోని కదిరి-పులివెందుల రహదారి సమీపంలోని బట్రేపల్లి జలపాతం కళ సంతరించుకుంది. పైనుంచి జాలువారుతున్న నీటితో హొయలొలికిస్తోంది. జలపాతాన్ని చూసేందుకు మండలవాసులే కాకుండా కదిరి, పులివెందుల నుంచి ప్రజలు వస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం సందడిగా మారింది. - తలుపుల

క్లుప్తంగా

హత్య కేసులో మరో 8 మంది అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ముదిగుబ్బ: మండలంలోని దొరిగిల్లు క్వార్టర్స్‌లో ఈ నెల 20న చోటు చేసుకున్న మంజుల అనంతయ్య హత్య కేసులో మరో ఎనిమిది నిందితులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ యతీంద్ర వెల్లడించారు. ఇప్పటికే ఈ కేసులో ఈ నెల 21న తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. తాజాగా చెడిపోతుల మనోహర్, కమతం చంద్రశేఖర్, చెడిపోతుల చంద్రశేఖర్, చీమల పవన్‌కుమార్, చీమల ప్రసాద్, గొరవ సునీల్, చెడిపోతుల బాలచంద్రుడు, చెడిపోతుల విజయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

సంపులో పడి బాలుడి మృతి


కార్తీక్‌రెడ్డి (ఫైల్)

తాడిమర్రి: వ్యవసాయ నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం గుడ్డంపల్లికి చెందిన జంబులూరు ప్రతాప్‌రెడ్డి, త్రివేణి దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. పెద్దకోట్లలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న కుమారుడు కార్తీక్‌రెడ్డి (10) ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో తల్లిదండ్రులతో కలసి తోట వద్దకెళ్లాడు. మధ్యాహ్నం ప్రతాప్‌రెడ్డి వేరుశనగ పంటను ఆరబోసి నిద్రపోతుండగా, అమ్మ త్రివేణి పొలం పనుల్లో నిమగ్నమైంది. అదే సమయంలో తాగునీటి కోసం సంప్ వద్దకెళ్లిన కార్తీక్‌రెడ్డి అదుపు తప్పి అందులో పడిపోయాడు. లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి ఊపిరి అందక మృతి చెందాడు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు రమ్మంటూ తల్లిదండ్రులు కేకలు వేసి పిలిచినా కుమారుడి నుంచి స్పందన లేకపోవడంతో గాలిస్తూ సంప్ వద్దకు చేరుకున్నారు. నీటిలో విగతజీవిగా తేలుతున్న కుమారుడిని చూసి ఆందోళనతో సంప్‌లోకి దిగారు. అయితే సంప్ నుంచి వారు సైతం బయటకు రాలేకపోవడంతో చుట్టుపక్కల రైతులు అక్కడకు చేరుకుని బయటకు లాగారు. అప్పటికే కుమారుడు మృతిచెందినట్లు నిర్ధారించుకున్న తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీసి, కేసు నమోదు చేశారు.

దళిత రైతులకు అండ...

- ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక ప్రోత్సాహం
- ప్రకృతి వ్యవసాయం చేపట్టే రైతులకు ఉచితంగా విత్తన కిట్ల అందజేత
- అందుబాటులో అవసరమైన పరికరాలు
- ఒక్కో రైతుకు రూ.10వేల వరకూ లబ్ధి
- జిల్లాలో 1,107 మంది ఎస్సీ రైతులకు పథకం వర్తింపు


ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన కందిపంట

మడకశిర: ప్రకృతి వ్యవసాయంలో రాణించేలా దళిత రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వారికి అండగా నిలిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన(పీఎంఏజేఏవై) ద్వారా ఇప్పటికే జిల్లాలోని 1,107 మంది దళిత రైతులను అధికారులు గుర్తించి, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అన్ని విధాలుగా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ పథకం కింద ఎస్సీ రైతులకు ఉచితంగా వివిధ రకాల విత్తన కిట్లు, పరికరాలను ప్రభుత్వం అందజేస్తోంది.

తొలి విడతలో 1,107 మంది ఎంపిక:

జిల్లా వ్యాప్తంగా 11,759 మంది ఎస్సీ రైతులు ఉండగా వీరిలో 1,107 మందికి పీఎంఏజేఏవై పథకం వర్తింపజేశారు. మొత్తం 12,944 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు చేపట్టారు.

జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతుల సంఖ్య :	11,759
ఎస్సీ రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మొత్తం విస్తీర్ణం :	12,944 ఎకరాలు
పీఎంఏజేఏవై కింద ఎంపికైన రైతుల సంఖ్య :	1,107
పీడీఎంఎస్ కిట్లలో ఉండే విత్తన రకాలు :	కందులు, పెసలు, వేరుశనగ, రాగులు, కొర్ర, సజ్జ
సీడ్ టు సీడ్ కిట్లలో ఉండే విత్తన రకాలు :	మొక్కజొన్న, జొన్న, సజ్జ, పెసలు, కంది, శనగలు

ఒక్క మడకశిర నియోజకవర్గంలోనే ఈ పథకానికి 754 మంది ఎస్సీ రైతులకు పథకం లబ్ధి చేకూరింది. ఒక్కో రైతుకు రూ.10వేలు విలువ చేసే విత్తన కిట్లు, పరికరాలను ఉచితంగా అందజేశారు. కిట్ల రూపంలో కందులు, పెసలు, వేరుశనగ, రాగులు, కొర్ర, సజ్జ విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. సీడ్ టు సీడ్ (ప్రారంభం నుంచి చివరి వరకు ప్రకృతి వ్యవసాయ విధానంలోనే పంటలు పండించడం) కిట్లలో మొక్కజొన్న, జొన్న, సజ్జ, పెసలు, కందులు, శనగ విత్తనాలు అందజేస్తున్నారు. వీటితో పాటు కిచెన్ గార్డెన్ కూరగాయల కిట్లను రెండు చొప్పున ఇస్తున్నారు. వీటికి తోడుగా ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన పరికరాలు కూడా ఇస్తున్నారు. వంద లీటర్ల డ్రమ్ములు రెండు, 200 లీటర్ల డ్రమ్ము ఒకటి, 30 పసుపు జిగట అట్టలు, 8 లింగాకర్షక బుట్టలు ఇస్తున్నారు. ఎస్సీ రైతులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ కిట్లను పూర్తి ఉచితంగా అందజేస్తోంది.

ఎస్సీ రైతులకు అందించే వివిధ రకాల పరికరాలు

100 లీటర్ల డ్రమ్ములు	:	2
200 లీటర్ల డ్రమ్ములు	:	1
టార్పాలిన్	:	1
పసుపు జిగట అట్టలు	:	30
లింగాకర్షక బుట్టలు	:	8

ఎంతో ఆనందంగా ఉంది



ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులను అనేక రకాలుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడం ఎంతో ఆనందంగా ఉంది. ఇప్పటికే కొంత మంది ఎస్సీ రైతులకు విత్తనాలు, పరికరాలను ఉచితంగా అందించారు. ప్రభుత్వ చర్యలతో మా జీవితాల్లో వెలుగులు నిండాయి.

– శోభారాణి, హరేసముద్రం, మడకశిర మండలం

ఖర్చు తక్కువ



ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రకృతి వ్యవసాయం చేపట్టాను. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధిస్తున్నా. ఈ ఏడాది కూడా వేరుశనగ పంట సాగు చేశా. ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుండడం ఎంతో సంతోషంగా ఉంది.

– సరస్వతి, మెళవాయి, మడకశిర మండలం

సద్వినియోగం చేసుకోవాలి



ప్రకృతి వ్యవసాయంలో ఎస్సీ రైతుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఇందులో భాగంగానే అనేక రకాలుగా వారికి ప్రోత్సాహం అందిస్తున్నాం. కొత్తగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పీఎంఏజేఏవై పథకాన్ని అమలు చేస్తూ ఉచితంగా విత్తన కిట్లు, పరికరాలు అందజేస్తున్నాం. ప్రభుత్వ పథకాలను ఎస్సీ రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– లక్ష్మానాయక్, డీపీఎం, జెడ్‌బీఎన్‌ఎఫ్


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

అమడగూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. దాదాపు పాతికేళ్ల తర్వాత కలుసుకున్న వారందరూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు.

రెవెన్యూ రికార్డులు చూసి మాట్లాడండి

- ఎవరి భూములూ లాక్కోలేదు
- ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి


మాట్లాడుతున్న ఆలూరి సాంబశివారెడ్డి

యల్లనూరు: టీడీపీ హయాంలో ఇచ్చిన పట్టాను ఇప్పుడు సమస్యగా సృష్టించి ఎమ్మెల్యే మీద రుద్దడం సబబు కాదని రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి అన్నారు. ఆదివారం యల్లనూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యల్లనూరు మండలం 85 నిట్టూరు గ్రామంలో జగనన్న భూహక్కు పత్రాలను అందజేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగ్యమ్మ, మరియమ్మ ప్రస్తావించిన భూ సమస్యతో అసలు సంబంధం లేదన్నారు. గత ప్రభుత్వంలో అందజేశారని, అనుమానం ఉంటే రెవెన్యూ రికార్డులు పరిశీలించుకోవాలని హితవు పలికారు. ఈ సమస్యను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దృష్టికి తీసుకెళ్లామని, ఆమె తక్షణమే స్పందించి రికార్డులు పరిశీలించాలని తహసీల్దారు సుమతిని ఆదేశించారని తెలిపారు. అర్హులైన వారికే పట్టా దక్కుతుందన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఈ అంశానికి కులం రంగు అద్ది గ్రామాల్లో కక్షలు రేకెత్తించేలా కథనాలు ప్రచురించే ధోరణికి ఇప్పటికైనా పచ్చ పత్రికలు స్వస్తి పలకాలన్నారు. ఎమ్మెల్యే పద్మావతికి సాయం చేయడం తప్ప.. అన్యాయం చేయడం రాదన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఎక్కువ మంది దళితులే లబ్ధి పొందారన్నారు. ఎవరి భూములను లాక్కోలేదనే విషయాన్ని గుర్తించి పిచ్చి రాతలు ప్రచురించడం మానుకోవాలని, లేకపోతే ప్రజాగ్రహానికి గురి కావాల్సి ఉంటుందని పచ్చమీడియాను హెచ్చరించారు.

పాము కాటుతో బాలుడి మృతి

పావగడ: తాలూకాలోని నాగలమడక హోబళి క్యాతగానకెరె గ్రామానికి చెందిన అంజినప్ప కుమారుడు ఆకాష్(7) పాము కాటుతో మృతి చెందాడు. శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. కాసేపటి తర్వాత తనకు కడుపు నొప్పిగా ఉందని బాలుడు ఏడుస్తుంటే వెంటనే తల్లిదండ్రులు ఉపశమన చర్యలు చేపట్టారు. ఆ సమయంలో దిండు (తలగడ) కింద నుంచి పాము బయటకు రావడంతో కాటు వేసినట్లుగా నిర్ధారించుకుని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తుమకూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై తిరుమణి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టీటీ రాష్ట్ర చాంపియన్‌గా శాన్వి


శ్రీ శాన్వి

అనంతపురం: విశాఖపట్నం వేదికగా సాగుతున్న రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో అండర్–13 విభాగంలో అనంతపురానికి చెందిన శ్రీశాన్వి ప్రథమ స్థానం సాధించి చాంపియన్ షిప్‌ను దక్కించుకుంది. వరుసగా నాలుగో సారి ఆమె రాష్ట్ర చాంపియన్‌గా నిలవడం గమనార్హం. అలాగే అండర్–15 విభాగంలో ద్వితీయ స్థానం దక్కించుకుంది.

కొనసాగిన మిక్స్‌డ్ జండర్ క్రికెట్ టోర్నీ

అనంతపురం: ఆర్డీటీ, అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఏపీఎల్ క్రికెట్ లీగ్ టోర్నీ కొనసాగుతోంది. రెండో రోజు ఆదివారం అనంతపురం, తపోవనం క్రికెట్ ట్రెనింగ్ సెంటర్, కళ్యాణదుర్గం, నార్పల, ఆత్మకూరు, జట్లు టోర్నీలో పాల్గొన్నాయి. వచ్చే వారంలోనూ టోర్నీ కొనసాగనున్నట్లు ఆర్డీటీ కోచ్ యోగానంద రెడ్డి తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

వజ్రకరూరు: మండలంలోని కమలపాడు గ్రామానికి చెందిన మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. ఈ నెల 18న సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పఠనాసక్తి పెంపొందేలా పుస్తకాలు

- తొలివిడతగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు అందజేత
- జిల్లాకు చేరిన 1,386 సెట్లు
- ఒక్కో సెట్‌లో 29 రకాల పుస్తకాలు


సమగ్రశిక్ష కార్యాలయంలో భద్రపరిచిన పాఠశాలల లైబ్రరీ పుస్తకాలు

రాప్తాడు రూరల్: పుస్తక పఠనం విద్యార్థి మేథోశక్తి పెంపునకు దోహదపడుతుందని అనేక అధ్యయనాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో 1 నుంచి ఇంటర్ వరకూ అన్ని తరగతుల విద్యార్థులకు ఉపయోగపడేలా పాఠశాలల గ్రంథాలయాలకు పుస్తకాలను సమకూరుస్తోంది. పాఠశాలల్లో తప్పనిసరిగా వారానికి ఒక పీరియడ్‌ను పుస్తక పఠనానికి కేటాయించేలా ఆదేశాలు జారీ అయ్యాయి.

జిల్లాకు చేరుతున్న పుస్తకాలు..

జిల్లాలోని 1,182 ప్రాథమిక పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు 29 టైటిళ్లతో కూడిన బుక్ సెట్, 204 ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించి ఒక్కో పాఠశాలకు 29 బుక్‌లతో కూడిన సెట్లు జిల్లా కేంద్రానికి చేరాయి. మొత్తం 1,386 పుస్తకాల సెట్లను అధికారులు సమగ్రశిక్ష కార్యాలయంలోని గోదాములో భద్రపరిచారు. ప్రాథమిక పాఠశాలలకు 51 బుక్‌ల సెట్లు, ప్రాథమికోన్నత పాఠశాలలకు 91 బుక్‌లతో కూడిన సెట్లు రావాల్సి ఉంది. 303 ఉన్నత పాఠశాలలకు 88 బుక్‌లతో కూడిన సెట్లు రానున్నాయి. 59 జూనియర్ కళాశాలలకు 77 బుక్‌లతో కూడిన సెట్లు రావాల్సి ఉంది. ఇవన్నీ వచ్చిన తర్వాత జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు పంపుతారు. అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా చేయనున్నారు.

విద్యార్థులకు చాలా ఉపయోగకరం..

లైబ్రరీ పుస్తకాలు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని డీఈఓ నాగరాజు అన్నారు. అభ్యాసన స్థాయిలు మెరుగుకు ఇవి దోహదపడతాయన్నారు. వారంలో ఒక పిరియడ్‌ను తప్పనిసరిగా లైబ్రరీలోని పుస్తకాలను చదివించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

'ఆపస్' నూతన కార్యవర్గం ఎంపిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

రాప్తాడురూరల్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నూతన కమిటీల ఎంపిక ప్రక్రియ ఆదివారం అనంతపురం లోని సరస్వతి విద్యా మందిరంలో నిర్వహించారు. రాష్ట్ర పరిశీలకులు కృష్ణార్జునరెడ్డి పర్యవేక్షణలో రెండు జిల్లాలకు కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతపురం జిల్లా అధ్యక్షురాలిగా కళ్యాణి, ప్రధాన కార్యదర్శిగా ఎర్రిస్వామి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా అమరా చంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా కె.సురేష్‌బాబు ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణస్వామి, శ్రీసత్యసాయి జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, కార్యదర్శి రమేష్, వెంకటేశులు, అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

విషాదంలోనూ నేత్రదానం


నేత్రాలను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివానగర్‌లో కోళ్లమొరం రామకృష్ణారెడ్డి(65) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న విశ్వదీప సేవా సంఘం సభ్యులు... మృతుడి కుటుంబ సభ్యులను కలసి నేత్రదానంపై అవగాహన కల్పించారు. దీంతో మరణానంతరం కూడా జీవించి ఉండాలనే తపనతో రామకృష్ణారెడ్డి నేత్రాలను దానం చేసేందుకు మృతుడి భార్య సుబ్బమ్మ, కుమారులు చెన్నకేశవరెడ్డి, చిన్న కృష్ణారెడ్డి, కుమార్తెలు సుజాత, లక్ష్మి, అల్లుడు వీరారెడ్డి ముందుకు వచ్చారు. దీంతో నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి నిపుణుడు నాగరాజు సేకరించారు. ఈ సందర్భంగా విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకుడు కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు గాజుల సురేష్ మాట్లాడుతూ.. రామకృష్ణారెడ్డి నేత్రాలను మరో ఇద్దరికి అమర్చడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నిండునున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మాధవ, ప్రభాకరరెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


గంగాధర్(ఫైల్)

ధర్మవరం అర్బన్: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని మాధవనగర్‌కు చెందిన గంగాధర్ (55)కు భార్య జయలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గంగాధర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మగ్గం నేసేందుకు ఆరోగ్యం సహకరించకపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన శనివారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు చెరువులో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడు చేరుకుని వెలికి తీసి ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆస్పత్రి వద్దకు చేరుకుని మృతుడిని గుర్తించి, బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి దుర్మరణం


శశికుమార్ (ఫైల్)


గాయపడిన కార్తికేయ

ముదిగుబ్బ: కల్వర్టును కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లికి చెందిన శశికుమార్ (24), పరిగి మండలం నారేపల్లికి చెందిన మహేష్‌తో పాటు మరో యువతి కార్తికేయ సొంత పనిపై ఆదివారం అన్నమయ్య జిల్లా మదనపల్లికి కారులో బయలుదేరారు.ముదిగుబ్బ సమీపంలోని మల్లక్క కొట్టాల వద్దకు చేరుకోగానే కారు వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొన్నారు. ఘటనలో కారులో ముందు సీటులో కూర్చొన్న శశికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కార్తికేయకు తీవ్ర గాయాల కాగా, స్వల్ప గాయాలతో మహేష్ బయటపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు కాపాడి 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సర్వాంతర్యామి సత్యసాయి

- గ్రామ సేవలతో ప్రజల హృదయాల్లో కొలువైన సాయి
- ఆకట్టుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు


నాటికలో సత్యసాయి వేషధారి


మంగళ హారతి ఇస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: సర్వాంతర్యామి సత్యసాయి బాబా అంటూ ఉమ్మడి మెదక్ జిల్లా సత్యసాయి భక్తులు పుట్టపర్తి సత్యసాయి బాబాను కొలిచారు. పర్తియాత్రలో భాగంగా సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తులు ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. గ్రామీణ వాతావరణం కళ్లకు కట్టినట్లు మందిరాన్ని తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ద్వాపర యుగంలో జరిగిన ఒక ఘటన ఆధారంగా చిక్కుముడులలో చిదంబర రహస్యం అనే నాటికను సత్యసాయి మహాసమాధి చెంత ప్రదర్శించారు. మూడు జిల్లాలకు చెందిన 150 మంది కళాకారులు గ్రామీణ నేపథ్యంలోని నృత్య రూపకాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. సత్యసాయి బాబా సర్వాంతర్యామి, స్వామి ఇందు కలదు అందు లేదను సందేహం వద్దు అంటూ సందేశాన్ని ఇచ్చారు. గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, గోమాతల రక్షణ వంటివి ఎన్నో ఉంటాయనే విషయాలను నాటికల ద్వారా ప్రదర్శించారు. అనంతరం జైశ్రీకృష్ణ గోవర్ధన గిరిధార, వీరాంజనేయ శ్రీరామ భక్త నమోనమో, జైజై విఠల పాండురంగ విఠల అంటూ 3 గంటల పాటు భక్తి గీతాలతో ఆకట్టుకున్నారు. అనంతరం కళాకారులకు సత్యసాయి చిత్రపటాలను సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు అందజేశారు.


నందనందన గోపాల అంటూ నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న బాలికలు


సత్యసాయికి నీరాజనం పలుకుతున్న బాలవికాస్ చిన్నారులు